## భట్టిప్రోలు నాగసుందరం స్మారక సంక్రాంతి కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ

# పెట్టుబడి

### అల్లంశెట్టి చంద్రశేఖరరావు

"వస్తానయ్యా అప్పారావ్."

"అప్పుడే వెళిపోతారా బాబాయ్."

"మెల్లగా నడుచుకుంటూ వెళ్తే జంక్షన్ చేరడానికి గంట పడుతుంది. అప్పటికి సాయంకాలం అయిపోతుంది. లేటయితే బస్సులు దొరకవు."

"కొంచెంసేపుండండి. నేనుగూడా వస్తాను. టీ తాగేసి వెళ్దాం. నాకుగూడ జంక్షనులో పనుంది"

టీ తాగిన తరువాత ఇద్దరం బైక్‌మీద బయలుదేరాం. తోవమధ్యలో బైక్ ఆపాడు. "రండి సర్వీతోట చూద్దురుగాని. ఇక్కడే. ఈ చోడిచేను దాటితే మనతోటే."

ఇద్దరం మడిగట్లమీద నడుస్తూ వెళ్తున్నాం. పూర్వం ఏతాలతో నీరు తోడేవారు అనడానికి ఆనవాలుగా రాటలున్నాయి. ఏతం పట్టీలు లేవు. చుట్టూవున్న చోడిచేలు ఎండిపోతున్నాయి. వాటివెనుకనున్న సర్వీమొక్కలు పచ్చగా నిగనిగలాడుతున్నాయి. అప్పారావు చిన్నరేకుల షెడ్డు దగ్గర ఆగాడు. పక్కనే ఒక ఎలక్ట్రిక్ స్తంభం ఉంది. దానినుండి నాలుగు తీగెలు షెడ్‌లోకి వస్తున్నాయి.

"ఈమధ్యనే బోరుతీయించాను బాబాయ్. పెద్దబోరు. బాగా నీరు పడింది. మోటారు బిగించాను."

షెడ్‌లోకి చూశాను. ఒక్క మైన్ బోర్డు తప్పిస్తే మోటారు కనబడలేదు. నా భావం గ్రహించాడు అప్పారావు.

"బోరులోనే మోటారు బిగించాను. సబ్‌మెర్సిబుల్ పంపు. భూమిలోనుండి వైరులు వున్నాయి. ఇక్కడ ఎవరమూ వుండం. కరంటు వున్నంతసేపూ మోటారు తిరుగుతూ వుంటుంది. ఎప్పుడైనా రిపేరు చేయవలసివస్తే ఆపుచేస్తాం. అంతే. ముప్పైవేలు ఖర్చయింది."

"ఇంత పెట్టుబడి పెట్టావా?"

"తప్పదు. సర్వీపట్టీలకు మంచి గిరాకీ వుంది. ఎక్కడికక్కడే డాబాలు లేచిపోతున్నాయి. దీనిమీద మంచిలాభం వస్తుంది గదా అని మొక్కలు వేయించాను. బాగా పెరిగాయి. మొక్కలన్నిటికీ నీరందేటట్లుగా కాలువలు ఏర్పాటుచేశాను. అప్పుడప్పుడు వచ్చి చూస్తుంటాను."

"మంచిపని చేస్తున్నావు. మీ నాన్నగూడ కష్టపడి పైకొచ్చాడు. రైతులకు ఫాయిదాలకు డబ్బిచ్చి, పంట కొలిపించుకునేవాడు. బాగా సంపాదించాడు. నువ్వు నీటిమీద పెట్టుబడి పెట్టావన్నమాట."

"కోపరేటివ్ సొసైటీలో లోను తీసుకున్నాను. నా దగ్గర డబ్బులేక కాదు. ఇటువంటి పనులకు బ్యాంకుల్లో రుణాలు తీసుకొంటేనే మంచిది. ఉత్తరోత్తరా చాలా లాభాలుంటాయి. మీ దగ్గర దాపరికం ఎందుకు? చిల్లర వడ్డీవ్యాపారం వుంది."

ఇద్దరం తిరుగుముఖం పట్టాం.

"పెసిడెంట్‌బాబూ! పెసిడెంట్‌బాబూ!" వెనుకనుండి ఎవరో పిలుస్తున్నారు. పైకి ఎగ్గట్టిన మాసిపోయిన పంచె, భుజం మీద చిన్నగావంచా, కొంచెం వయస్సు మళ్ళినా కండలు కనిపిస్తున్నాయి. ఒళ్ళంతా చెమట.

"పెసిడెంట్ బాబూ! నువ్వే ఆదుకోవాలి. మీ నాన్న వున్నప్పుడు మదుపులకి అప్పిచ్చి ఆదుకునేవాడు"

"ఇప్పుడు నా దగ్గర డబ్బు లేదు"

"డబ్బుకాదు. నీళ్ళిప్పించు. సోడిసేను పాలు తొడుగుతుంది. నీళ్ళు లేకపోతే ఒక్క గింజకూడా దక్కదు. రెండు తడులిప్పించినావంటే సాలు. నూతిలో నీరునేదు. నువ్వే కాపాడాల. నా కుటుంబానికి కూడెట్టినోడివౌతావు."

"నాకెలాగౌద్ది. సర్వీమొక్కలకు నీళ్ళుండాలి."

"అవి పెద్దవైపోయినాయి గదా! నాలుగురోజులు నీళ్ళు లేకపోయినా తట్టుకోగలవు. నీకాళ్ళొట్టుకుంటాను. బాబ్బాబు. కాదనకు. ఎలాగైనా రెండు తళ్ళిప్పించు. వరసగా వద్దులే. ఈయాల, మళ్లీ నాలుగు రోజులు పోయినాక. బాబ్బాబు." బతిమాలుకుంటన్నాను. కాదనకు. నీదయ"

"సరే! నీకు రెండురోజులకే ఇస్తాను. అవతల పాపారావు గూడ అడుగుతున్నాడు. ప్రెసిడెంటుని గదా ఎవరినీ కాదనకూడదు. నీకు తెలుసుగదా! గంటకి మూడువందలు."

"తెలకుండా ఉంటాదా! రేటెట్టేసినావు గదా! అందాకా ఈ ఐదొంద లుంచు. కరంటు గూడ వుసితమేగదా బాబూ నీకు"

"అటువంటి మాట లంటేనే నాకు చిర్రెత్తుకొస్తాది. కరంటుచితమే. మరి నీరెవడి బాబుగారిది. నువ్వూ మోటారు పెట్టుకుంటే నీకూ గవర్నమెంటు ఉచితంగానే కరెంటు ఇస్తాది."

"నేను మోటారు దేనికి పెట్టుకోవాలి. నువ్వు బోరేయించిన తరువాత మా నూతుల్లో నీటిసుక్క వుంటే ఒట్టు. మా ఏతాలు ఆడడం మానేసినాయి."

"తప్పు నాదంటావా?"

"తప్పు నీదికాదు బాబూ! ఈ బూదేవిది. ఈ నీటిది. సేదుకున్నోడిదగ్గిరికే సేరిపోద్ది"

"నాలాగా బోరు తవ్వించుకో"

"నా దగ్గిర అంత ఎక్కడుంటాది. మీబోటోల్లు సాయం సేసినా పంటమీదే అప్పు తీర్చాల. పంటంతా పాయిదాలకింద పోతే మాం ఏటితిని బతకాల."

"అదే నేనంటన్నది. నాకు ఎంతైందో తెలుసా? ఏభైవేలు. బయటకు చెప్పుకోలేని కర్చులుంటాయి. మామూళ్ళుంటాయి. కస్టాలుంటాయి. మీబోటోళ్ళు తట్టుకోలేరు. దేనికైనా పెట్టుబడుండాలి."

"అంతేబాబూ! అంతే! ఎంతసెట్టుకి అంత గాలి. కాయకస్టానికి మాత్రం విలువనేదు"